సన్నాలకు ఫుల్ డిమాండ్



జూపాక గ్రామంలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

- యాసంగి ఆరంభంలోనే క్వింటాల్ రూ.2,650
- తక్కువ విస్తీర్ణంలో సాగు
- దిగుబడిపై రైతన్నల్లో దిగులు

హుజూరాబాద్‌రూరల్: ఎన్నడూ లేని విధంగా సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,650 పలుకుతోంది. ప్రస్తుతం సన్నరకానికి డిమాండ్ ఉండటంతో పాటు పంట తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈఏడాది ఆరంభంలోనే ఇంత ధర ఉంటే చివరికి రూ.3,200 వరకు ఉంటుందని అంచనా.

సాగు తక్కువ... డిమాండ్ ఎక్కువ...

మండల వ్యాప్తంగా 24,400 ఎకరాల్లో వరి సాగు చేశారు. అందులో 9,120 ఎకరాల్లో సన్నరకం సాగు చేశారని అంచనా. మిగిలిన ఎకరాల్లో దొడ్డురకం సాగు చేశారు. ఇప్పటికే దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు ఐకేపీ కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సన్నరకం మిల్లర్లు కొనుగోలు చేయనున్నారు.

భారీగా డిమాండ్..

దొడ్డురకం ఐకేపీల ద్వారా ప్రభుత్వ మద్దతు ధర రూ.2,200 కొనుగోలు చేయనున్నారు. సన్నరకం కేవలం మిల్లర్లు కొంటారు. వానాకాలం ఆరంభంలో రూ.2,400 పలికిన ధర కొద్దిరోజుల తర్వాత ఒకేసారి పంట చేతికి రావడంతో మిల్లర్లు ధర తగ్గించి క్వింటాల్‌కు రూ.2,200–2,100 వరకు కొనుగోలు చేశారు. యాసంగి ఆరంభంలో రూ.2,250 నుంచి రూ.2,450 వరకు వెళ్లి చివరకు రూ.2,550 వరకు కొనుగోలు చేశారు. ధర తగ్గించిన సమయంలో రైతులు ఓపికగా ఆరబెట్టి దాశారు. దీంతో మిల్లులకు ధాన్యం రాకపోవడంతో ధర పెంచేశారు. అదే దాచిన ధాన్యం రూ.3,750 వరకు కొనుగోలు చేశారు. కొత్త ధాన్యం వచ్చేలోగా అమ్ముకుంటే ధర వస్తుందని కొత్తవి వస్తే పాతవి అంత ధర పెట్టి కొనుగోలు చేయరని మిల్లర్లు పేర్కొంటున్నారు. ఈ సారి ధర ఎక్కువగా ఉండే అవకాశం ఉందని మిల్లర్లు చెబుతున్నారు.

తగ్గనున్న దిగుబడి...

ఈ సారి దిగుబడి బాగా తగ్గే అవకాశం ఉంది. ఎండల తీవ్రత ఉంది. ఎండల తీవ్రతకు ఏపుగా పెరగకపోవడంతో పాటు ఆశించిన స్థాయిలో పంట ఆరోగ్యంగా లేదని రైతులు అంటున్నారు. గతంలో సన్నరకం పచ్చి వడ్లు ఎకరాకు 40–45 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. ఇప్పుడు 25–30 బస్తాల దిగుబడి రావడమే కష్టమని రైతులు అభిప్రాయపడుతున్నారు. పంటకాలం సైతం ఎక్కువగా ఉంటుందని వెదజల్లిన, డ్రమ్ సీడర్‌తో వేసిన పంట ఆలస్యంగా వస్తుందని, నాట్లు వేసిన వరి త్వరగా చేతికి వస్తుందని చెబుతున్నారు. పుష్కలంగా నీరు ఉన్న పొలాల్లో 45 బస్తాల దిగుబడి వస్తుందని, నీరు సరిగా అందక ఎండల తీవ్రతకు ఎండిపోయి మళ్లీ కొలుకున్న పొలాల్లో 25 బస్తాల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఈ సారి పంట పంట సైతం కోతకు వచ్చే సూచనలు లేవు. వానాకాలం వర్షాలకు అనుగుణంగా సాగు పెంచుకుంటూ సెప్టెంబర్ 15 వరకు నాట్లు వేశారు. అవి డిసెంబరు చివరికి కోతకు రానున్నాయి.

మద్దతు ధర పెంచాలి



వ్యయప్రయాసాల మధ్య సన్నరకం పంట సాగవుతోంది. సన్నరకం పంటను కాపాడాలంటే ప్రతిరోజు చీడపీడల నివారణ, కలుపు తీయటం, తెగుళ్ల నివారణకు పురుగు మందులు పిచికారీ చేయాలి. పంట కాలం ఎక్కువగా ఉండటంతో పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. సన్నరకం ధాన్యానికి మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోవాలి.

– వంగాల వెంకట్‌రెడ్డి, రైతు, సిర్సపల్లి

దిగుబడిపై దిగులు..



ఈ సీజన్‌లో వరి సాగులో దిగుబడిపై ఆశలు సన్నగిల్లిపోతున్నాయి. చీడపీడలు, తెగుళ్ల సమస్య బాగా పెరిగింది. ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లతో పెట్టుబడి వ్యయం పెరిగింది. పంట దిగుబడి తక్కువ వస్తుందేమోనన్న బెంగ పట్టుకుంది. మద్దతు ధర పెంచితే తప్పా లాభం ఉండదు. ప్రభుత్వం రైతుల పరిస్థితిని గమనించాలి.

– మండల కళ, మహిళా రైతు, చెల్పూర్

సలహాలు, సూచనలు పాటించాలి



వరి సాగు చేసే రైతులు తప్పనిసరి వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటించాలి. కోతలు ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం ఆరబెట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ధాన్యంలో తేమ లేకుండా చూసుకోవాలి. సన్నరకం సాగుచేసే రైతులు చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు కలుపు నివారణ చర్యలు చేపట్టాలి.

– సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, హుజూరాబాద్

క్లుప్తంగా

‘కాళేశ్వరం’ సందర్శనకు తరలిన నాయకులు



కాళేశ్వరం వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ పిలుపు మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బుధవారం తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి ప్రత్యేక బస్సుల్లో మేడిగడ్డకు వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి పొన్నం ప్రభాకర్ పోటీ చేస్తున్నట్లు ప్రచారం. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ఇదే మంచి తరుణమని నాయకులు తెలిపారు. వెళ్లిన వారిలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బోయిని నరేశ్ ఉన్నారు.

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయాలి



మాట్లాడుతున్న కొంకటి శేఖర్

రామడుగు: లక్షల కోట్ల ప్రజాధనం వృథా చేసిన సీఎం కేసీఆర్‌పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ నాయకుడు కొంకటి శేఖర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాలుగు పిల్లర్లు కుంగడానికి బీఆర్‌ఎస్, కేసీఆర్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు షమీమ్, మనోహర్, వినోద్, రమేశ్, సత్యం, అనిల్ పలువురు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యంపై జీపీ కార్యదర్శులకు మెమోలు

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ఇప్పటివరకు ఈజీఎస్ పనులు అనుకున్న స్థాయిలో పూర్తి కాలేదని, బాధ్యులైన పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేశామని ఎంపీడీఓ ఎం.నర్సయ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. గతేడాది ఏప్రిల్ నుంచి వచ్చే మార్చి వరకు కూలీలకు రూ.1.56 కోట్ల విలువ గల 2,14,802 పనిదినాలను కల్పించాల్సి ఉందన్నారు. కానీ ఇప్పటి వరకు కనీసం 40 శాతం పనులు పూర్తికాని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేశామన్నారు. మండలంలో 7,174 జాబ్ కార్డులున్నాయని, ఇందులో 5,572 మంది పనులకు హాజరవుతున్నారని, డిసెంబర్ చివరి వరకు 100 శాతం పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కొండాపూర్, చిగురుమామిడి, రేకొండ, చిన్నములకనూర్, బొమ్మనపల్లి, సీతారాంపూర్, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, సుందరగిరి గ్రామాల్లో కేవలం 40శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన గ్రామాల్లో 60 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుగేందర్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో బుధవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను జిల్లా కార్యదర్శి యుగేందర్ ఆవిష్కరించారు. ఈనెల 29, 30న హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పిట్టల సమ్మయ్య, సదానందం, సాగర్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

శంకరపట్నం: మండంలోని తాడికల్ గ్రామంలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మహిపాల్, సతీశ్, సంపత్, పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వాన్ని గెలిపిద్దాం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేసే కేసీఆర్ ప్రభుత్వాన్ని గెలిపిద్దామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 16, 30, 24, 12, 22, 11వార్డుల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేసీఆర్ మేనిఫెస్టో రూపొందించారని, ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే వెయ్యి కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు కూతాడి రాజయ్య, మద్ది లావణ్యసంపత్, శ్రీపతి నరేష్, బచ్చు శివశంకర్, రామడుగు రవీందర్, వార్డు అధ్యక్షులు, యూత్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బి. గోపి

చొప్పదండి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చేపట్టే నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి. గోపి అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నామినేషన్ స్వీకరించే రోజు నుంచి ప్రక్రియ ముగిసేవరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు దారిని, దుకాణాలను మూసివేయాలని సూచించారు. నామినేషన్ వేసే వారితో పాటు మరో నలుగురిని అనుమతించాలని సూచించారు. 11 గంటలకు ముందు, మధ్యాహ్నం 3 గంటల తర్వాత నామినేషన్లు స్వీకరించొద్దని, నామినేషన్ల స్క్రూటినీ ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారనే సమాచారం అభ్యర్థులకు తెలియజేయాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. కార్యాలయంలో వెంటనే వ్యయ పరిశీలన, సీ– విజిల్, కంట్రోల్ రూం బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి, ఏసీఎల్‌బీ ప్రఫుల్ దేశాయ్, తహసీల్దార్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, సీఐ రవీందర్, ఎస్‌ఐ ఉపేంద్రచారి పాల్గొన్నారు.

భూ ఆక్రమణ, అక్రమ నిర్మాణం

- తహసీల్దార్ కార్యాలయానికి విరాళంగా ఇచ్చిన భూమిపై అధికార పార్టీ నేత కన్ను
- గ్రామస్తుల ఫిర్యాదుతో ఆర్‌ఐ, సర్వేయర్ మోఖా పరిశీలన, భూమికి హద్దురాళ్ల ఏర్పాటు
- ఆక్రమిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



భూమిలో అక్రమ నిర్మాణం

సైదాపూర్: తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చిన ఎనిమిది గుంటల భూమిని ఆక్రమించటంతోపాటు అందులోని షెడ్డు నిర్మాణాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆరు నెలలుగా గ్రామస్తులు జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ అడ్డుకుంటున్నారు. అధికారుల ఆదేశం మేరకు ఆక్రమిత భూమికి హద్దులు ఏర్పాటు చేయడానికి బుధవారం గిర్దావర్ శరత్‌కుమార్, సర్వేయర్ మనోహర్ మోఖా పరిశీలించారు. గ్రామస్తులు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో హద్దురాళ్లు పాతారు. పూర్తి వివరాలు...సైదాపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాన్ని వెన్కెపల్లి ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి తరలించాలని అప్పటి అధికారులు, పాలకులు చేస్తున్న ప్రయత్నాన్ని సైదాపూర్ పంచాయతీ పాలకులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. సైదాపూర్‌లోనే తహసీల్దార్ కార్యాలయం నిర్మించాలని గ్రామానికి చెందిన కూతురు నర్సింహారెడ్డి 06/01/2007లో అంగూర తోటలో సర్వే నెం. 111అలో 0.08 గుంటల భూమిని ప్రభుత్వానికి దానంగా ఇచ్చారు. అప్పుడే రెవెన్యూ అధికారులు ఎనిమిది గుంటల భూమి కొలిచి స్వాధీనం చేసుకున్నారు. స్థలం అనువుగా లేదని అధికారులు ఆసక్తి చూపలేదు. దీంతో గ్రామ నడిబొడ్డున భూలక్ష్మీ దగ్గర నర్సింహారెడ్డి నాలుగు గుంటల భూమితో కూడిన సొంతిల్లు కుమారులు సైతం తహసీల్దార్ కార్యాలయానికి దానంగా రాసిచ్చారు. అయినప్పటికీ 2009లో తహసీల్దార్ కార్యాలయం వెన్కెపల్లికి తరలి వెళ్లింది. అంగూర తోటలో 111అలో నర్సింహారెడ్డి నుంచి 32 గుంటల భూమిని అధికార పార్టీ నేత, ప్రస్తుత సర్పంచ్ చందా శ్రీనివాస్ కొనుగోలు చేశాడు. అందులో సుమారు ఎనిమిది గుంటల వైశాల్యంలో పాడుబడ్డ బావిని గత పంచాయతీ పాలకులు పూడ్చివేశారు. పూడ్చిన భూమిని వదిలేసి, తహసీల్దార్ కార్యాలయానికి ఇచ్చిన భూమిపై సర్పంచ్ కన్నేశాడు. దానంగా ఇచ్చిన భూమిలో అక్రమంగా నిర్మాణం చేస్తున్నాడని గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయం నుంచి గిర్దావర్ శరత్‌కుమార్, సర్వేయర్ మనోహర్ భూమిని పరిశీలించారు. హద్దురాళ్లు పాతాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. దానం ఇచ్చిన వ్యక్తి కూతురు లీలారెడ్డి అభ్యంతరం తెలిపిందని, ఆమె సమక్షంలో హద్దురాళ్లు పాతుతామని రెవెన్యూ అధికారులు చెప్పడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామస్తులు అధికారుల ఎదుట బైఠాయించారు. దీంతో గ్రామస్తుల సమక్షంలో హద్దులు ఏర్పాటు చేశారు. పంచాయతీ, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన సర్పంచ్ భూమి ఆక్రమించుకుంటున్నాడని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, విద్యాన్‌రెడ్డి, కృష్ణమూర్తి, రమేశ్, అశోక్, రవీందర్‌గౌడ్, దొనికెన రమేశ్, రాములు, యాదగిరి, వీరయ్య, అనిల్, కనకయ్య, రాహుల్, సురేశ్, వేముల సురేశ్, కమ్మం రమేశ్, మొండయ్య, సాగర్, శ్రీకాంత్, భరత్, నిక్కి, సారయ్య, పర్శ రాములు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలిచింది ‘బీఆర్‌ఎస్’

- జంగపల్లిలో ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి సామాన్య ప్రజలకు అండగా నిలిచిన ఘనత బీఆర్‌ఎస్ కే దక్కుతుందన్నారు. అభివృద్ధి పనులు, ప్రజలకు ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేయడం, ప్రజా సంక్షేమాన్ని విస్మరించడం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట, బడుగు, బలహీన, నిరుపేద వర్గాలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. ఇంటింటికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఆసరా పెన్షన్, రైతులకు పెట్టుబడి సాయం పెంచడం, ప్రతి కుటుంబానికి భీమా సదుపాయం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు కుసుంభ నవీన, సర్పంచ్ ఆటికం శారద సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు మోహన్ రెడ్డి, ఆంజనేయులు, మాజీ జెడ్పీటీసీ మన్మోహన్‌రావు, నాయకులు మల్లేశం, వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్, రాజేశం, లింగయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తిమ్మాపూర్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మానకొండూర్ నియోజకవర్గ కార్యాలయంలో తిమ్మాపూర్ మండలం పోలంపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలతోపాటు వివిధ కుల సంఘాల నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ తిమ్మాపూర్ మండల ఉపాధ్యక్షుడిగా మహ్మద్ నబీ, మండల యూత్ ఉపాధ్యక్షుడిగా కోతి నరేశ్, మండల యూత్ ప్రధాన కార్యదర్శిగా సంగాల పవన్, మండల విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా గొట్టిపర్తి మధుకర్‌ను నియమిస్తూ ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ల్యాగల వీరారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బొజ్జ తిరుపతి, తోట మధు, పోలంపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు



వాహన తనిఖీల్లో ఏసీపీ జీవన్‌రెడ్డి

జమ్మికుంట: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బుధవారం రాత్రి టౌన్ సీఐ బార్పటి రమేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరూ పాటించాలని, నగదు తరలించే సమయంలో సరైన పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రాజేశ్, శ్రీధర్, ఏఎస్‌ఐ రవి పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



1997-98 విద్యార్థులు



1995-96 విద్యార్థులు

తిమ్మాపూర్/చిగురుమామిడి: తిమ్మాపూర్ మండలం అలుగునూర్ 1997-98, చిగురుమామిడి మండలం సుందరగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1995-96 పదో విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. యోగక్షేమాలను తెలుసుకుంటూ ఆటపాటలతో సంతోషంగా గడిపారు.

గ్యారంటీలతో మభ్యపెట్టే ప్రయత్నం

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తుందని, 2009లో ఇచ్చిన హామీలు అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. మండల కేంద్రంలోని మధురానగర్‌లో బుధవారం బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో సీఎం అభ్యర్థులు ఎక్కువ, వారికి వచ్చే ఓట్లు మాత్రం తక్కువని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ ఘటన వెనుక కుట్రకోణం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ పర్యటన చేసినప్పుడు కనీసం ప్రజలు కనిపించని పరిస్థితి నెలకొందన్నారు. సీఎం కేసీఆర్ పేదలకు ఉపయోగకరంగా మేనిఫెస్టో రూపొందించారని అన్నారు. సమావేశంలో ఎంపీపీ శ్రీరాం మధు, సింగిల్ విండో చైర్మన్లు తిర్మల్‌రావు, బాలాగౌడ్, పుల్కం నర్సయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



బొమ్మనపల్లిలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడి: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మనపల్లిలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను గడపగడపకూ వివరించాలని కోరారు. వొడితెల సతీశ్‌కుమార్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ భూంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ రమేశ్, కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విజ్జగిరి, మహేందర్, విజ్జగిరి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



ఆదర్శ అసోసియేషన్ జట్టు

శంకరపట్నం: మండల కేంద్రంలో దసరా పండుగ పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. కేశవపట్నం గ్రామానికి చెందిన ఆదర్శ అసోసియేషన్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా ఎంపీటీసీ అనిల్, ఉపసర్పంచ్ హన్మంతు, రిటైర్డ్ ఉద్యోగి కిష్టస్వామి సంయుక్తంగా రూ. 15వేలు అందించారు. రన్నరప్ జట్టుకు ఎంపీటీసీ బొజ్జ కవిత కోటిలింగం రూ.10 వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో తిరుపతి, జక్కని సంజయ్, సదానందం, ప్రశాంత్, సంపత్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.